


# పరదేశీ కథలు

- చిట్టే సిద్ధ లలిత



- 115 -

## కడప రెడ్డెమ్మ కథ

**వచ్చీరాని అక్షరాలతో** కూడబలుక్కుని ఉత్తరాన్ని చదివింది రెడ్డెమ్మ. విషయం అర్థమై ముఖం కోపంతో జేవురించింది. కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. పట్టరాని కోపంతో ఉత్తరాన్ని చించి ముక్కలు చేసి మూలకు విసిరికొట్టింది రెడ్డెమ్మ. ఆవేశంతో ఆమె ముక్కుపుటాలు అదురుతున్నాయి. కన్నీళ్ళు పొంగుకొచ్చాయి.

తరువాత కాసేపటికి తెరిపినపడి ముఖం కడుక్కుని ఆలోచిస్తూ వుండిపోయింది.

"ఏమయిందిమే రెడ్డీ అలా కూర్చున్నావూ.. బాత్ రూములు కడగవా ఏమి..? సేతాని వస్తే ఎలా.. ఇంటికాడ్నించి జాబొచ్చిందా.. ఏమి..? అంతా బాగున్నారు కదా" ప్రశ్నించింది దేశమ్మ.

"ఆ..ఆ వచ్చింది. ఆ మోసగాడు నాకొడుకు ఎంకటేసు ఖద్దరు చొక్కా వేసుకుని కడపలో పబ్లిగ్గా తిరుగున్నాడంట.

నా బట్ట నా దుడ్డంతా తిని నన్ను మోసంచేసి పోయినాడు. వాడి కాళ్ళుచేతులు పడిపోనూ" తిట్టింది రెడ్డెమ్మ.

"నాది కూడా వంద దినార్లు పోయింది కదా. ఏం చేస్తాం. ఏదో ఒకరోజు వాడి పాపం పండుతుందిలే. అందరి గోడు కొట్టుకుని నాశనమై పోతాడు వాడు. మనం ఈ కువైట్ ఇంట్లో వంట చేసి బాత్రూములు కడిగి కష్టపడి సంపాదించిన దినార్లన్నీ వాడి చేతుల్లో పోసాం. మన కష్టం ఊరికే పోదులే రెడ్డెమ్మా.. దేవుడు దయ చూస్తాడు. ఓపికతో వుండు" అని ఓదార్చింది దేశమ్మ.

"ఊరికే వుండడం కాదు దేశమ్మా.. వాడికి తగిన బుద్ధి చెప్పాలి.నన్నేకాదు చాలామందిని ఇదే విధంగా ముంచాడు వాడు. శుక్రవారం మాలియాకు పోతే పాపం అందరూ ఏడుస్తున్నారు. ఎంతో కష్టపడి సంపాదించిన దినార్లు వాడి మొహాన పెట్టాం. అంతా దోచుకుని కువైట్ వదిలిపెట్టి ఇండియాకు పోయి పెద్దమనిషిలా తిరుగుతున్నాడట. వాడ్ని ఊరికే వదలను" పళ్ళు కొరికింది రెడ్డెమ్మ.

ఆమె ఆవేశానికి అర్థం వుంది. మూడేళ్ళ క్రితం కడప పక్కన వున్న తిమ్మారెడ్డిపల్లి నుండి కువైట్ కు వచ్చింది రెడ్డెమ్మ. ఒక సేటు ఇంట్లో పనికి కుదిరింది. అష్టకష్టాలు పడి అక్కడి పని, భాష నేర్చుకుంది. మొదట్లో పనిరాకపోతే సేఠాని కొట్టింది కూడా. వెంకటేసు అప్పటికే అయిదేళ్ళనుండి ఆ ఇంట్లో డ్రైవర్ గా వుంటూ తన తెలివితో అక్కడ బాగా పాతుకుపోయాడు.

డ్రైవర్లకు ప్రతి శుక్రవారం సెలవు వుంటుంది. ఆడవాళ్ళకు సెలవులు తక్కువే. కువైట్ ఇస్లామిక్ దేశం కాబట్టి స్త్రీలకు పెద్దగా స్వేచ్ఛ వుండదు. వెంకటేసు శుక్రవారం ఉదయాన్నే మాలియాకు పోయి రకరకాల వ్యాపారాలు చేసేవాడు.

తెలిసినవాళ్ళకు వడ్డీలకు డబ్బులిచ్చేవాడు. చిట్టీ వ్యాపారం కూడా చేసేవాడు. చాటుగా సారాయి, వక్కాకు అమ్మేవాడు.

ఒక ఇల్లు తీసి అందులో పది పార్టిషన్లు పెట్టి రెంట్ కు ఇచ్చేవాడు. వీసాల వ్యాపారం చేసేవాడు. మన తన అని చూడకుండా దయాదాక్షిణ్యాలు లేకుండా వడ్డీలు నిర్దాక్షిణ్యంగా వసూలు చేసేవాడు. అంతా దోపిడీనే. తెలిసికూడా జనాలు అవసరంతో వాడి వద్దకే వెళ్ళేవారు.

కానీ.. మనుషుల ముందు కల్లబొల్లి మాటలు చెపుతూ చాలా మంచివాడిగా వాడు నటించేవాడు. వాడి వలలో పడనివారు అరుదుగా వుంటారు. అక్కడ మాలియాలో వాడిని వడ్డీల వెంకటేసు అని పిలుస్తారు.

రెడ్డెమ్మ కూడా వచ్చీ రాగానే వాడి మాయమాటలు విని వాడు చెప్పినవన్నీ నమ్మింది. మొదట్లో మంచిగా మాట్లాడి తరువాత నెల జీతాలతో, జీవితాలతో ఆటాడుకోవడం వాడికి వెన్నతో పెట్టిన విద్య.

"ప్రతినెలా జీతాన్ని నాకిచ్చావంటే వడ్డీలకు తిప్పి రెట్టింపు చేస్తాను. కొంత చిట్టీల్లో పెట్టి లాభం వచ్చేట్లు చూస్తాను.

సంవత్సరం సంపాదన నాకిస్తే మరో సంవత్సరంలో దానిని రెట్టింపు చేస్తాను. నన్ను నమ్ము రెడ్డెమ్మా నిన్ను లక్షాధికారిని చేస్తాను" అని నమ్మపలికాడు.

అప్పటినుండీ చేసిన కష్టమంతా అతడి చేతుల్లో ధారపోసేది. వాడికి చాలామంది తెలుగువాళ్ళతో పరిచయాలున్నాయి. చాలామంది తెలుగువాళ్ళు వెంకటేసును నమ్మి దినారాలు ఇచ్చేవాళ్ళు. అందరినీ చూసి రెడ్డెమ్మకు నమ్మకం కుదిరింది. అందులో అదే ఇంట్లో డ్రైవర్ గా పని చేస్తూ కళ్ళముందే వున్నాడు. ఎక్కడికి పోతాడు అనుకుంది.

సంవత్సరం గడిచిపోయింది. ఇదిగో ఇస్తాను అదిగో ఇస్తాను అంటూ మరో ఆరునెలలు గడిపేసాడు.

ఒకరోజు సేటు బీరువాలోని తన పాస్ పోర్టునూ, సేటు దాచుకున్న దినారాల కట్టలను దొంగిలించి ఎవరికీ చెప్పకుండా ఇండియాకు పారిపోయాడు.

కువైట్ సేటుకు చాలా కోపం వచ్చింది.

"వెధవ నమ్మితే ఇంత పని చేస్తాడా.. వాడు కనపడితే కాళ్ళూ చేతులూ విరిచేస్తా" అని రంకెలు వేసాడు.

"రెడ్డీ వాడిది మీ ఊరే కదా.. ఇండియాకు పోదాం పద. అక్కడ వాడి తోలు తీస్తా అని కోపంతో అరిచాడు. తరువాత పోయి వాడిపైన పోలీస్ కంప్లైంట్ ఇచ్చాడు.

అయినా ఏం లాభం. దేశం దాటిపోయిన దొంగను ఎవరూ ఏం చెయ్యలేరు. డబ్బు ఇచ్చినవాళ్ళందరూ కూడా లబోదిబోమని మొత్తుకున్నారు.

ఒక్కొక్కటిగా వాడు చేసిన నేరాలన్నీ వెలుగులోకి వచ్చాయి. దేశం దాటిపోయాక ఎవరేం చేయగలరు..? కడపలో వాడి ఇంటికి మనుషులను పంపించారు.

అక్కడ వాడు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయి భార్య, బంధువుల చేత "వెంకటేసు ఇంటికి రాలేదు. ఎక్కడవున్నాడో మాకూ తెలియదని చెప్పారు."

తరువాత కొద్దిరోజులకు అందరి వద్దా దోచుకున్న డబ్బుతో వెంకటేసు కడపలో షాపింగ్ కాంప్లెక్స్ ఒకటి కట్టించాడు. ఖద్దరు చొక్కా వేసుకుని బిఎం డబ్ల్యూ కారు కొని దానిలో తిరగసాగాడు.

సంవత్సరం గడిచింది.

ఇప్పుడు కడపలో వెంకటేసు బాగా పేరు గల వ్యక్తి. తన పలుకుబడిని ఉపయోగించి రాజకీయనాయకులకు కుడి భుజం అయ్యాడు. కడపలో వ్యాపారాలు మొదలు పెట్టి కోట్లు గడించసాగాడు.

ఇక్కడ కువైట్ లో వాడిచేత మోసపోయిన జనాల బాధలు మాటల్లో చెప్పలేము. కొంచెం కాదు. వేల దినారాలు దోచుకుపోయాడు వాడు.వాడి గురించి కువైట్ లో తెలిసే కొద్దీ అందరి హృదయాలు కోపంతో భగ్గుమంటున్నాయి.

కానీ ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. అక్కడ ఇండియాలో అయినవారిని పంపించి అడిగిస్తే వాడు పలుకుబడి ఉపయోగించి నోరు మూయిస్తున్నాడు. రౌడీలను పంపించి వారిని బెదిరిస్తున్నాడు.

పరిస్థితి ముదిరిపోయిందని, వాడి దగ్గర్నుండి డబ్బు తిరిగి రాదని అందరికీ అర్థమయిపోయింది. ఏం చెయ్యాలో తెలియక కష్టమంతా వాడి మొహాన పెట్టినందుకు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. రెడ్డెమ్మ చిన్నాయన కొడుకు చంద్ర కూడా కువైట్ లోనే వుంటాడు. వాడు కూడా వెంకటేసు దగ్గర సుమారు పది లక్షల రూపాయలు చిట్టీలు వేసాడు. రెడ్డెమ్మ మధ్యవర్తిగా వుండి చంద్రకు భరోసా ఇచ్చింది. ఇప్పుడు వాడు రెడ్డెమ్మదే బాధ్యత అని గొంతు పట్టుకుని కూర్చున్నాడు.

రెడ్డెమ్మ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఒకటా రెండా.. పది లక్షల రూపాయలు.

వాడికి సర్ది చెప్పలేక నలిగిపోసాగింది. ఇంతలో ఊరినుండి ఈ ఉత్తరం వచ్చింది. వెంకటేసు తెల్లటి ఖద్దరు చొక్కాలు వేసుకుని బిఎండబ్ల్యూ కారులో తిరుగుతున్నాడని, ఎమ్మెల్సీ గా కూడా పోటీ చేస్తున్నాడని రాసారు.

రెడ్డెమ్మ కడుపు మండింది. ఇండియాకుపోయి వెంకటేసునే అడిగి తాడో పేడో తేల్చుకోవాలని నిశ్చయించుకుంది

మామా దగ్గరికి పోయి "ఇంటి దగ్గర అర్జంట్ పని వుందని నెలరోజులు సెలవు కావాలని" అడిగింది.

ఏ కళన వుందో సేతాని "సరే" అని ఒప్పుకుంది.

ఆఘమేఘాలమీద బయలుదేరి కడపకు చేరుకుంది రెడ్డెమ్మ.

వాడి జాడలు పట్టుకుని పోయి మర్యాదగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వమని నిలదీసింది.

వాడు వంకర నవ్వు నవ్వాడు. "పిచ్చిదానా.. ఇంత శ్రమ పడి నువ్వు ఇండియాకు వచ్చావా? నీలాంటి వెర్రివాళ్ళు ఎందరో.. ఎవ్వడూ ఏమీ పీక లేకపోయారు. నోర్మూసుకుని మర్యాదగా నీ దారిన నువ్వు పో. లేకపోతే అడ్రస్ లేకుండా చేస్తా. తరువాత కువైట్ కూడా పోలేవు. నాతో పెట్టుకుంటే కీళ్ళు విరిచేస్తా" అని బెదిరించాడు.

వళ్ళు మండింది రెడ్డెమ్మకు. అప్పటికి ఆవేశాన్ని దిగమ్రింగి ఇంటికి వచ్చింది. ఎలా వాడికి బుద్ధి చెప్పాలా అని తీవ్రంగా ఆలోచించింది.

ఎలక్షన్స్ దగ్గర పడ్డాయి. పోయి ప్రతిపక్షంలోని నాయకుడు వీరారెడ్డిని కలిసి కువైట్లో వెంకటేసు చేసిన దుర్మార్గాలను ఏకరువు పెట్టింది. ఎంతోమంది వాడిని నమ్మి కష్టార్జితాన్ని పోగొట్టుకుని కష్టంలో వున్నారని, వాడికి తగిన బుద్ధి చెప్పాలని వేడుకుంది.

అందుకు పావుగా మారడానికి కూడా సిద్ధంగా వున్నానని ఆవేదన వ్యక్తం చేసింది.

ఆయన శ్రద్ధగా విని చలించిపోయి "ఏం చేద్దామో నేను ఏ సహాయం చెయ్యాలో నువ్వే చెప్పు రెడ్డెమ్మా" అని అడిగాడు.

ప్రతిపక్షంలో చేరి వెంకటేసుకు వ్యతిరేకంగా ప్రచారం చెయ్యసాగింది రెడ్డెమ్మ. కువైట్ లో వాడు చేసిన దురాగతాలను వరసగా ఏకరువు పెట్టింది. కరపత్రాలను ముద్రించి జనాలకు పంచింది. వాడు ఎంతమందిని ఎన్ని విధాలుగా మోసం చేసాడో ప్రజలకు వివరించింది.

ప్రజల్లో వెంకటేసు పట్ల వ్యతిరేకత పెరిగింది.

రెడ్డెమ్మను చూసి ఇంకో ఇద్దరు ముగ్గురు కువైట్ నుండి వచ్చి వాళ్ళకు వెంకటేసు చేసిన అన్యాయాన్ని జనాల్లో పంచుకున్నారు. వాడు చేసిన మోసాలన్నీ బయటపడ్డాయి. సభలు పెట్టించి జనాలను ప్రోగు చేసి బహిరంగంగా వెంకటేసు గురించి చెప్పసాగారు.

వెంకటేసుకు దిక్కుతోచక కోపంతో పళ్ళు కొరికాడు.

"నిన్ను కడపలో నడి బజారులో గుడ్డలిప్పి కొడతానే" అని రంకెలేసాడు.

ఆమె భయపడలేదు. ఇంకా ఏం చెయ్యాలా? వాడికి సరైన గుణపాఠం ఎలా చెప్పాలా అని బాగా ఆలోచించింది రెడ్డెమ్మ.

వాడివలన తనకు దెబ్బ తగలకముందే వాడిని తెలివిగా దెబ్బ కొట్టాలని నిర్ణయించుకుంది. కానీ అలా జరగలేదు.

ఆ రాత్రి ప్రమాదం ముంచుకొచ్చింది. పదిమంది గూండాలు దారి కాచి రెడ్డెమ్మ వెళుతున్న కారును అటకాయించి బాంబులేసారు. డ్రైవర్ ఫాస్ట్ గా నడపడంతో తృటిలో తప్పించుకున్నారు వీళ్ళు. రౌడీలు విడువక వెంబడించి కారును ఆపారు.

డ్రైవరు, కార్లో వున్న రెడ్డెమ్మ చిన్నాయన కొడుకు భయంతో వణికిపోతున్నారు. రౌడీలు కారు డోరు తెరిచి రెడ్డెమ్మను బయటికి లాగి చీర పట్టుకుని లాగబోయారు. రెడ్డెమ్మ భయపడలేదు. గింజుకుని వారి పట్టునుండి విడిపించుకుని బ్యాగులో దాచిన కత్తిని బయటికి తీసింది.

"రండిరా రౌడీ వెధవల్లారా.. తగలండిరా చూద్దాం. వంటిపై చెయ్యి పడిందో ఒకడ్ని అయినా వేసేస్తా" అంటూ పులిలా గర్జించింది. ఒక్కడుగు వెనక్కి వేసారు వాళ్ళు. ఇంతలో  ముందు జాగ్రత్త చర్యగా ప్రతిపక్ష నాయకుడు రెడ్డెమ్మ వెనుకే ఫాలో అవమని చెప్పడంతో పది మంది యువకులు సమయానికి అక్కడికి చేరుకున్నారు.

వాళ్ళు వీళ్ళు కలబడి కొట్టుకున్నారు. వీరి గొడవ కేకలు విని అక్కడి ఊరి జనాలు పరిగెత్తుకు రావడంతో వెంకటేసు పంపిన రౌడీలు పారిపోయారు.

అలా అదృష్టవశాత్తూ  ఆరోజు ప్రాణాపాయం నుండి తప్పించుకుంది రెడ్డెమ్మ.

ఇక ఉపేక్షిస్తే లాభం లేదని, జాప్యం చేస్తే ప్రమాదమని గ్రహించి ప్రతిపక్ష నాయకుని సహాయంతో పదిమంది యువకులను వెంట పెట్టుకుని తనే స్వయంగా రంగంలోకి దిగింది రెడ్డెమ్మ. ఆమే ఒక సైన్యంగా మారింది.

వెంకటేసు చర్యలను బాగా గమనించింది. వాడి రాకపోకలలో రెక్కీ నిర్వహించింది.

ఆడది ఏం చేస్తుందిలే ఈపాటికి బాంబుల దెబ్బతో భయపడి వుంటుంది అని తేలిగ్గా తీసుకున్నాడు వెంకటేసు. అదే అతడు చేసిన పొరపాటు.

ప్రచారంలో భాగంగా ఓట్లు వేయమని అర్థిస్తూ ఇంటింటికీ తిరుగుతూ డబ్బు పంచిపెడుతున్న వెంకటేసును కడప సెంటర్ లో అడ్డగించింది రెడ్డెమ్మ..

వెనక నుండి దాడి చేసిన నలుగురు యువకులు కారు అద్దాలు పగలగొట్టి కారులో వున్న డబ్బు మూటను లాక్కెళ్ళారు. మరోవైపు కోపంతో రగిలిపోతున్న రెడ్డెమ్మ వెంకటేసు ఎదుట నిలిచి కాలి చెప్పును తీసి పటాపటా వాడి మొహం మీద కొట్టి వాడి మొహాన ఉమ్మేసింది.

వాడు తేరుకునేలోపు జనంలోకి వెళ్ళి మాయమయ్యింది.

ఇంతటి అవమానాన్ని ఊహించలేని వెంకటేసు తలెత్తుకోలేకపోయాడు. కారు ధ్వంసం అయ్యింది. కారులోవున్న కోటి రూపాయల డబ్బూ పోయింది.

నడివీధిలో ప్రజల ఎదుట చెప్పుదెబ్బలతో వాడికి సన్మానం జరిగింది. పిచ్చి కోపంతో ఊగిపోయాడు వాడు. రెడ్డెమ్మను చంపి పారెయ్యమని రౌడీలను పంపించాడు.

ఎక్కడుంది రెడ్డెమ్మ..? వెంకటేసును నమ్మి మోసపోయినవాళ్ళకు ఆ కోటిరూపాయలను పంచిపెట్టమని చెప్పి చెన్నై ఎయిర్ పోర్టులో కువైట్ వెళ్ళే విమానం ఎక్కుతోంది రెడ్డెమ్మ.

ఎవ్వరూ చెయ్యలేని పని ఒక్క ఆడది చేసిందని ఊరూరా ఆ ఘనకార్యాన్ని చెప్పుకున్నారు. రాజకీయ నాయకులు, జనాలు "శభాష్" అంటూ రెడ్డెమ్మను మెచ్చుకున్నారు. కువైట్ సేటు కూడా విషయం తెలిసి మంచిపని చేసావని రెడ్డెమ్మను అభినందించాడు

కొన్నిరోజులు అన్ని పేపర్లలో ఈ వార్త ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. కడప రెడ్డెమ్మ తెగువను, ధైర్యాన్ని, ధీరత్వాన్ని చాలా రోజులు కువైట్ లోనూ ఇండియాలోనూ జనాలు కథలు కథలుగా చెప్పుకున్నారు.

పరదేశంలో నమ్మిన వారిని మోసం చేసిన ఆ నీచుడికి తగిన శాస్తి జరగిందని అందరూ భావించారు. ఎలక్షన్స్ లో ప్రతిపక్ష నాయకుడు వీరారెడ్డి గెలిచాడు. రెడ్డెమ్మను ఇంటికి తిరిగి వచ్చి రాజకీయాల్లోకి రమ్మని ఆహ్వానించాడు.

"సరే అన్నా" అంటూ ఇండియా రావడానికి రెడ్డెమ్మ బ్యాగు సర్దుకుంది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments